ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

సిద్దిపేట

మంగళవారం 1 జూలై 2025

పింఛన్ డబ్బుల పేరుతో వృద్ధ మహిళలకు

మోసం

● 2 తులాల బంగారం అపహరించిన దుండగుడు 6

పోక్సో కేసులో శిక్ష పడుతుందోమోనని యువకుడి ఆత్మహత్యాయత్నం 6



ఉదయాన్నే ఉద్యోగానికి వెళ్లిన భర్త ఆచూకీ తెలియక రోదిస్తున్న భార్య.. రోజూలాగే విధులకు వెళ్లిన తమ తండ్రి ఏమయ్యాడో తెలియక.. ఎవరిని అడగాలో పాలుపోక బిక్కుబిక్కుమంటూ ఏడుస్తున్న ఓ వలస కార్మికుడి కుమార్తెలు.. తమవారు ఏమయ్యారోనని ఆందోళనతో కుటుంబ సభ్యులు, మృతదేహాలు ఎక్కడున్నాయో తెలియక పరిశ్రమ చుట్టూ తిరుగుతున్న బంధువుల రోదనలు.. అంబులెన్సుల సైరన్లతో 'సిగాచి' పరిశ్రమ ప్రాంగణం దద్దరిల్లింది. పాశమైలారం పారిశ్రామికవాడలోని రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలిన ఘటనలో బాధిత కుటుంబాల వేదన కంటనీరు పెట్టించింది. తమ వారు అటు ఆస్పత్రిలో లేక.. ఇటు పరిశ్రమ వద్దా కనిపించకపోవడంతో గుండెలు బాదుకుంటూ కనిపించిన పోలీసులను, అధికారులను వేడుకోవడం కనిపించింది.

పటాన్‌చెరు/పటాన్‌చెరు రూరల్/ రామచంద్రాపురం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి)







పేలుడు ధాటికి కుప్పకూలిన సిగాచి పరిశ్రమ భవనం

మరిన్ని వార్తలు 7లో

మృత్యు సిగాచి

నేలపైనే మృతదేహాలు



పటాన్‌చెరు ఆస్పత్రిలో మృతదేహాలు

ప్రమాదంలో మృతిచెందిన వారిలో తొమ్మిదిమంది మృతదేహాలు పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువచ్చారు. కానీ, తగినన్ని ఫ్రీజర్లు లేకపోవడంతో మృతదేహాలని నేలపైనే ఉంచారు. అంబులెన్స్ రాగానే మృతదేహం తమ వారిదేనేమోనని బంధువులు పరుగులు తీయడం కలిచివేసింది. పరిశ్రమ వద్ద శిధిలాలు తొలగిస్తున్న క్రమంలో మృతదేహాలు దొరికితే తమవారేనేమో అనుకుంటూ బంధువులు ఎగబడ్డారు. పోలీసులు దగ్గరకు రానివ్వకపోవడంతో బాధితుల బంధువులు వారితో వాగ్వాదానికి దిగారు. రాళ్లతో దాడికి కూడా ప్రయత్నించారు. మరోవైపు ప్రమాదంలో గాయపడినవారిని మదీనాగూడ అర్చన, బీరంగూడ పనేసియా, ఇస్నాపూర్ కాకతీయ తదితర ఆసుపత్రులకు తరలించి చికిత్సలు అందిస్తున్నారు. కాలిన గాయాలు ఎక్కువగా ఉన్నవారి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లా అధికారులేకాకుండా హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులు కూడా సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితి సమీక్షిస్తున్నారు.

దద్దరిల్లిన పాశమైలారం పారిశ్రామికవాడ

- భర్త ఆచూకీ తెలియక భార్య.. తండ్రి కనిపించక కుమార్తెలు
- తమ వారు ఎక్కడున్నారని పడిగాపులు
- లోపలికి వెళ్లనివ్వాలని వేడుకోలు.. పోలీసులతో వాగ్వాదం
- వలస కార్మికుల వేదన పట్టించుకునే దిక్కేది?
- గాయపడి చికిత్స పొందుతున్న వారికి పలకరింపు కరువు
- మృతిచెందినా దక్కని కనికరం.. పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో నేలపైనే మృతదేహాలు

19 మందిని బలిగొన్న పరిశ్రమ



సహాయక చర్యల్లో నిమగ్నమైన వివిధ విభాగాల సిబ్బంది

- ఉదయం 6.00: ఫస్ట్ షిఫ్ట్ కార్మికులు డ్యూటీలో చేరారు
- ఉదయం 9.00: జనరల్ షిఫ్ట్ కార్మికులు వచ్చారు
- ఉదయం 9.10: పరిశ్రమలో రియాక్టర్ పేలింది
- ఉదయం 9.40: సుమారు అరగంట పాటు మంటలు.. దట్టమైన పొగ
- ఉదయం 9.45: స్థానికులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు ప్రారంభం
- తొలుత నాలుగు మృతదేహాల గుర్తింపు
- 34 మందిని స్థానిక ఆస్పత్రులకు తరలింపు
- మధ్యాహ్నం 2.00 ఎనిమిది మంది చనిపోయినట్లు ధ్రువీకరణ
- సాయంత్రం 4.00 మృతుల సంఖ్య 12గా గుర్తింపు.
- అర్ధరాత్రి మృతుల సంఖ్య 19కు చేరింది



రోదిస్తున్న ఓ కార్మికుడి కుటుంబ సభ్యులు

- పరిశ్రమలో ఉన్న కార్మికులు 163 మంది
- చనిపోయింది 19 మంది.. గాయపడి ఆస్పత్రుల్లో చేరింది 34 మంది
- మొత్తం క్షతగాత్రులు 50 మంది
- జాడ తెలియని మిగిలిన కార్మికులు
- చనిపోయిన వారిలో ఒడిషా, బీహారీలే ఎక్కువ.. తెలుగు రాష్ట్రాల వారూ..



శిథిలాలను తొలగిస్తున్న యంత్రాలు

కార్మికులకు **భద్రతేదీ** 7

పరిశ్రమ వద్ద కంట్రోల్‌రూం

బస్సు వచ్చిన నిమిషాలకే పేలుడు

ప్రత్యక్ష సాక్షి కథనం

'జనరల్ షిఫ్ట్ కార్మికులను తీసుకువచ్చే బస్సు అప్పుడే వచ్చిందని, కార్మికులంతా బస్సు దిగి లోపలికి వెళ్లిన నిమిషాలకే భారీ పేలుడు చోటుచేసుకుందని' ప్రమాదాన్ని దగ్గర నుంచి చూసిన పక్క పరిశ్రమలో పనిచేసే కార్మికుడు తెలిపాడు. భారీ పేలుడు సంభవించడంతో భూమి దద్దరిల్లిందని చెప్పాడు. వెంటనే మంటలు ఎగిసి పడటంతో కార్మికులు రక్షించాలని అరిచారని తెలిపాడు. తమ పరిశ్రమ వైపు మంటలు వ్యాపిస్తుండటంతో పైపులతో నీటిని చల్లి అదుపు చేశామని వివరించాడు. మంటల్లో చిక్కుకున్నవారిని రక్షించే అవకాశం కూడా రాలేదన్నారు. తామే ఫైర్‌స్టేషన్, అధికారులకు ఫోన్ చేసి సమాచారం అందజేశామని తెలియజేశాడు. కొద్ది నిమిషాల్లో తేరుకుని ప్రమాద స్థలానికి చేరుకుని సిగాచి సిబ్బందితో కలిసి క్షతగాత్రులను తరలించామని చెప్పాడు.



సిగాచి పరిశ్రమను పరిశీలించేందుకు వస్తున్న మంత్రి గడ్డం వివేక్



అధికారులకు సూచనలిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ



మహిళతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు



క్షతగాత్రుడిని మోసుకువస్తున్న తోటి కార్మికులు

ప్రజావాణిలో కాలక్షేపం

- సెల్‌ఫోన్లలో చాటింగ్, వీడియోలు, రీల్స్ చూస్తూ బిజీ..
- అర్జీదారుల సమస్యలు పట్టని పలువురు అధికారులు, సిబ్బంది తీరు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 30 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం పలువురు అధికారులు, సిబ్బంది తీరు వల్ల అభాసుపాలవుతున్నది. సిద్దిపేట కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్లు గరీమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్ అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుంటే పలువురు అధికారులు, సిబ్బంది మాత్రం తమకేమి పట్టనట్టుగా సెల్‌ఫోన్లలో మునిగిపోయారు. కొందరు రీల్స్ చూస్తు, మరికొందరు చాటింగ్, ఫోన్లు మాట్లాడుతూ... కాలక్షేపం చేశారు. కలెక్టర్ ఆయా శాఖల అధికారులను పిలవగానే తమ ఫోన్లను పక్కపెట్టి వెళ్లి దరఖాస్తుదారు సమస్య విని తిరిగి వారికి కేటాయించిన సీట్లలో కూర్చుని మళ్లీ సెల్‌ఫోన్లతో టైంపాస్ చేయడం కనిపించింది. ప్రజావాణి కార్యక్రమానికి టోకెన్ల వారీగా లోపలికి పంపడంతో అర్జీదారులు అసహనానికి లోనై పోలీసులతో వాగ్వాదానికి దిగారు. కుర్చీలు కూడా లేవని అధికారుల తీరుపై మండిపడ్డారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ కల్పించుకుని కూర్చోవడానికి కుర్చీలు వేయాలని సూచించారు.



కొద్దిమందిని మాత్రమే లోనికి అనుమతించడంతో ఆందోళన చేస్తున్న అర్జీదారులు



చాటింగ్ చేస్తూ, ఫోన్లు మాట్లాడుతూ, రీల్స్ చూస్తూ కాలక్షేపం చేస్తున్న పలు శాఖల అధికారులు, సిబ్బంది

ఈ ఏడాదిలో వచ్చిన ఫిర్యాదులు 1508

ఈ ఏడాది జనవరి నుంచి జూన్ 30 (ఆరు నెలలు) వరకు సిద్దిపేట జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో 1508 మంది అర్జీలు పెట్టుకున్నారు. ఇప్పటి వరకు వచ్చిన 1508 దరఖాస్తుల్లో 966 పరిష్కరించగా ఆయా శాఖల్లో 542 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు

కొమురవెల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి సోమవారం సాయంత్రం ఇరిగేషన్ అధికారులు డీఈ అంజయ్య, ఏఈ సుదీప్ బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను విడుదల చేశారు. ఖరీఫ్‌కు రైతుల అవసరాల కోసం నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపుతామని, ప్రస్తుతం ఫేజ్-2 పంపు నుంచి నీళ్లు వస్తున్నాయని, త్వరలోనే ఫేజ్-3 పంపు నుంచి కూడా నీళ్లు వస్తాయన్నారు. రిజర్వాయర్ నిండితే మళ్లీ బోర్లు పుష్కలంగా పోసే అవకాశం ఉంటుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

● సిద్దిపేట సీపీ అనురాధ



సిద్దిపేట క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసును త్వరగా పరిష్కరించాలని సిద్దిపేట సీపీ అనురాధ పోలీస్ అధికారులకు సూచించారు. సోమవారం పోలీస్ అధికారులతో కమిషనర్ కార్యాలయంలో పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి ఏసీపీలను, సీఐలను అడిగి తెలుసుకున్నారు. క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చాలా ముఖ్యమని, డయల్ 100 కాల్స్‌పై అలసత్వం వహించవద్దన్నారు.

● పోలీస్ రిటైర్‌మెంట్ వృత్తికే కానీ వ్యక్తిత్వానికి కాదని సీపీ అన్నారు. సిద్దిపేట కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఎస్‌బీ ఎస్ఐ జాలిగామ బాల మల్లయ్య, కోహెడ స్టేషన్ ఏఎస్ఐ ఎడ్ల పవన్ కుమార్, ఏఎస్ఐ సీఏఆర్ హెడ్‌క్వార్టర్‌లో పనిచేస్తున్న ఏఆర్ ఎస్ఐ అబ్దుల్ బాసిత్ ఉద్యోగ విరమణ సందర్భంగా సీపీ అనురాధ కమిషనర్ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించి మాట్లాడారు.

121 ఫోన్లు బాధితులకు అప్పగింత

పడిపోయిన, చోరీకి 121 ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీతో రికవరీ చేసి సోమవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ అనురాధ సంబంధిత బాధితులకు అందజేశారు. ఇప్పటివరకు 2450 ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు ఆమె తెలిపారు.

వెల్దుర్తి సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో చోరీకి యత్నం

● అలారం మోగడంతో పరారైన దుండగులు



వెల్దుర్తిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గోడకు కన్నం వేసిన దుండగులు, పరిశీలిస్తున్న పోలీసులు

వెల్దుర్తి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని ఓ బ్యాంకులో చోరీకి దొంగలు విఫలయత్నం చేశారు. అలారం మోగడంతో పారిపోయారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. వెల్దుర్తి అంబేడ్కర్ చౌరస్తాలో ఉన్న సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భవనం గోడకు కన్నం వేసిన దుండగులు ఆదివారం అర్ధరాత్రి 1.39 గంటలకు బ్యాంక్ స్టోర్ రూమ్‌లోకి ప్రవేశించారు. బ్యాంకులోని లాకర్‌ను తెరిచేందుకు ప్రయత్నించగా ఒక్కసారిగా అలారం మోగడంతో దుండగులు పరారయ్యారు. అలారం చప్పుడు విని బ్యాంకు పక్కనే నివాసం ఉండే ఉద్యోగులు, స్థానికులు నిద్ర లేచి బ్యాంకు వద్దకు వచ్చి పరిశీలించారు. దొంగతనం చేసేందుకు యత్నించినట్లు గుర్తించి 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే ఎస్సై రాజు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అనంతరం తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ రంగకృష్ణ తెల్లవారుజామున 3 గంటలకు బ్యాంకుకు చేరుకొని పరిశీలించారు. మెదక్ నుంచి వచ్చిన క్లూస్ టీమ్ బ్యాంకులో ఆధారాలను సేకరించారు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, గతంలోనూ ఈ బ్యాంకులో చోరీ చేసేందుకు యత్నించారని, అప్పుడు కూడా ఇలాగే గోడకు కన్నం వేసి విఫలయత్నం చేశారని బ్యాంకు సిబ్బంది, స్థానికులు తెలిపారు.



ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో.. ఇద్దరి యువకుల దుర్మరణం

● బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ప్రమాదం


బస్సు కింద నుజ్జునజ్జయిన ఆటో

మెదక్ కల్చరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఆటో ఢీకొట్టడంతో ఆటోలోని ఇద్దరు ప్రాణాలు కోల్పోయిన ఘటన మెదక్ మండల పరిధిలోని మంబోజిపల్లి గ్రామ శివారులో గల ఎన్‌ఎస్‌ఎఫ్ ఫ్యాక్టరీ వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొల్చారం మండలం పోతన్‌శెట్టిపల్లికి చెందిన శ్రీకాంత్(26), కౌడిపల్లికి చెందిన నరేష్(25) ఆటోలో మెదక్ మండలంలోని మంబోజిపల్లి నుంచి వెళ్తున్నారు. శ్రీకాంత్ ఆటో నడుపుతుండగా, ఎన్‌ఎస్‌ఎఫ్ ఫ్యాక్టరీ వద్ద ముందుగా వెళ్తున్న బైక్‌ను ఓవర్‌టేక్ చేసేందుకు ఆటో వేగం పెంచాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును గమనించకపోవడంతో బస్సును బలంగా ఢీకొట్టాడు. రెండు వాహనాలు వేగంగా ఉండడంతో ఆటో బస్సు మధ్యలో ఇరుక్కుని నుజ్జునుజ్జు అయింది. ఆటోలోని శ్రీకాంత్, నరేష్ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ మురళి ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను మెదక్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పింఛన్ డబ్బుల పేరుతో వృద్ధ మహిళలకు మోసం

● 2 తులాల బంగారం అపహరించిన దుండగుడు
● తూప్రాన్‌లో ఆటో స్టాండ్ వద్ద ఘటన


మోసపోయిన వృద్ధ మహిళలు

తూప్రాన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పింఛన్ డబ్బులు వచ్చాయని నమ్మించి, ఒకే ఊరికి చెందిన ఇద్దరు వృద్ధ మహిళలను మోసగించి 2 తులాల బంగారాన్ని అపహరించిన ఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. తూప్రాన్ పట్టణ పరిధి పడాలపల్లికి చెందిన చెప్యాల లలిత(75) తూప్రాన్‌లోని ఆసుపత్రిలో చూపించుకునేందుకు వచ్చింది. అదే గ్రామానికి చెందిన శంకరంపేట స్వరూప కూడా లక్ష్మక్కపల్లి ఆసుపత్రికి వెళ్లింది. సోమవారం మధ్యాహ్నం తూప్రాన్ ఆటో స్టాండ్ వద్ద ఇద్దరు వృద్ధులు కలిశారు. ఒకే ఊరు కావడంతో మాట్లాడుకుంటూ కూర్చున్నారు. ఆ సమయంలో సుమారు 35 ఏళ్ల వయస్సున్న, టోపీ ధరించిన గుర్తు తెలియని ఓ యువకుడు వారి వద్దకు వచ్చాడు. లలితకు పింఛన్ డబ్బులు వచ్చాయని, సంతకాలు చేయాలని నమ్మించే ప్రయత్నం చేశాడు. మొన్ననే వచ్చాయి అని లలిత చెప్పగా, 'మొన్న రెండు వేలే ఇచ్చారు. ఇంకా డబ్బులు వచ్చాయి, మా సార్ వద్దకు వెళ్దాం' అని చెప్పి రమ్మన్నాడు. మహిళ నమ్మకపోవడంతో, ఫోటో దిగితేనే డబ్బులు వస్తాయి అని చెప్పి నమ్మించాడు. పక్కనే ఉన్న స్వరూపను కూడా సార్ వద్దకు వెంట పంపించండి అని సూచించాడు. అక్కడ ఫొటో దిగాల్సి ఉంటుందని నమ్మకం కలిగించాడు. ఫోటో దిగే సమయంలో మెడలో నగలు ఉండాలని సూచించి, లలితమ్మ మెడలోని 2 తులాల బంగారు గొలుసు తీసి స్వరూప మెడలో వేయాలని పేర్కొన్నాడు. గొలుసు తీయగానే స్వరూప చేతిలో పెట్టినట్లుగా నటిస్తూ బంగారు గొలుసును లాక్కొని అక్కడి నుంచి పరారయ్యాడు. మోసపోయిన వృద్ధ మహిళలు లబోదిబోమంటూ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు.

మూడు కిలోల ఎండు గంజాయి స్వాధీనం

రామచంద్రాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : లేబర్ షెడ్లలో ఎండు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని కొల్లూరు పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ రవీందర్ కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన శ్రీధర్ మాలిక్(35) కొల్లూరులోని అనీల్ రోలింగ్స్‌లో పనిచేస్తున్నాడు. ఒడిశా రాష్ట్రం నుంచి 3 కిలోల ఎండుగంజాయిని తీసుకువచ్చి లేబర్ షెడ్లలో విక్రయిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కుక్కల దాడిలో 20 మేకలు మృతి

కోహీర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కుక్కల దాడిలో 20 మేకల మృతిచెందిన సంఘటన సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గురుజువాడ గ్రామంలో సోమవారం జరిగింది. గురుజువాడ గ్రామానికి చెందిన ముజాఫర్ పటేల్ మేకల ఫామ్‌లో ఉన్న మేకల మందపై ఊర కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 20 మేకలు మృతి చెందినట్లు బాధితుడు ముజాఫర్ ఆవేదన వ్యక్తం చేశారు. మేకలు మృతి చెందడంతో తాను ఆర్థికంగా నష్టపోయానని ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధిత రైతు ముజాఫర్‌పటేల్ కోరారు.

గౌడిగూడెం శివారులో ఇసుక డంపు సీజ్

తూప్రాన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం గుండ్రెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గౌడిగూడెం శివారులో అక్రమంగా ఇసుక ఫిల్టర్లను నిర్వహిస్తున్న ఘటనపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. తూప్రాన్ ఎస్ఐ-2 యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో విష్ణువర్ధన్‌రెడ్డికి చెందిన ఇసుక డంపును సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక ఫిల్టర్లను నిర్వహిస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు. సీజ్ చేసిన ఇసుక డంపును రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

తైవాన్‌లో ఇంటర్న్‌షిప్‌కు బీవీఆర్ఐటీ విద్యార్థి ఎంపిక

నర్సాపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీ కాలేజీలో కెమికల్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి కె.అనంతరావు తైవాన్ దేశంలోని నేషనల్ చెంగ్ కుంగ్ విశ్వవిద్యాలయంలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె తెలిపారు. ఇంటర్న్‌షిప్‌లో భాగంగా రేడియేటివ్ కూలింగ్ మెటీరియల్స్ ఉత్ప్రేరకం, అధునాతన పరిశోధన ప్రాజెక్టులో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల తరఫున చైర్మన్ విష్ణురాజు, వైస్‌చైర్మన్ రవిచంద్రన్, సెక్రటరీ అదిత్య, డైరెక్టర్ లక్ష్మి తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.


ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

బైక్‌ను ఢీకొన్న కారు.. భార్య మృతి

భర్తకు తీవ్ర గాయాలు


దాసరి స్వప్న(ఫైల్)

తూప్రాన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం స్టేషన్ మాసాయిపేట వద్ద 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందగా, భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. తూప్రాన్ ఎస్ఐ-2 యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం... మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన దాసరి రమేష్, దాసరి స్వప్న(29) ద్విచక్ర వాహనంపై చేగుంట మండలం మక్కరాజుపేటకు వెళ్లారు. సోమవారం స్వగ్రామానికి తిరిగి వెళ్లేందుకు బయలుదేరారు. మార్గమధ్యలో స్టేషన్ మాసాయిపేట వద్ద యూటర్న్ తీసుకుంటుండగా, హైదరాబాద్ వైపు వేగంగా వెళ్తున్న కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో దంపతులు తీవ్రంగా గాయపడగా, ఆసుపత్రికి తరలిస్తుండగా దాసరి స్వప్న మార్గమధ్యంలోనే మృతిచెందింది. భర్త దాసరి రమేష్‌ను చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. రమేష్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చికిత్స పొందుతూ బాలిక...

జహీరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్సపొందుతు బాలిక మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. కుటుంబీకులు, గ్రామస్థుల కథనం ప్రకారం ఝరాసంగం మండలం బిడెకన్నె గ్రామానికి చెందిన లక్ష్మణ్-మధులతలు కొంతకాలంగ జహీరాబాద్ పట్టణంలో నివాసం ఉంటున్నారు. మే 22న పట్టణంలో నివాసం ఉంటున్న ఇంట్లోనే దీపం ప్రమిద షరోని(7) మీదపడి గౌనుకు మంటలు అంటుకుని గాయాలకు గురైంది. బాలికను చికిత్స కోసం సంగారెడ్డికి తీసుకువెళ్ళి తల్లిదండ్రులు ఇప్పటివరకు సుమారు రూ.3లక్షలకుపైగానే ఖర్చులు చేశారు. సంగారెడ్డిలో చికిత్సపొందుతూ బాలిక ఆదివారం మృతి చెందిదని వారు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రామచంద్రాపురం, జూన్ 30 (ఆంధ్ర జ్యోతి) : అవుటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఎగ్జిట్ -2 కొల్లూరు రేడియల్ రోడ్డు-7 ఎక్స్‌టెన్షన్ వద్ద ఓ గుర్తు తెలియని మృత దేహాన్ని సోమవారం కొల్లూరు పోలీసులు స్వాధీన పర్చుకున్నారు. స్థానికులు రోడ్డు పక్కన గుర్తు తెలియని మృత దేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాని సీఐ రవీందర్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు కొల్లూరు పోలీసులకు సంప్రదించాలని సీఐ చెప్పారు.

బొమ్మారెడ్డిగూడెంలో మద్యం విక్రయాలపై నిషేధం

అతిక్రమిస్తే రూ.50 వేలు జరిమానా


తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న యువకులు

పుల్‌కల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం గిరిజన తండాలో యువకులు కదం తొక్కారు. గిరిజన తండాలోని కిరాణ దుకాణాల్లో మద్యం విక్రయాలు చేపడుతుండటం పట్ల ఆగ్రహించారు. తండాలో బెల్టుషాపులను నిర్వహిస్తూ పెద్దఎత్తున మద్యం విక్రయాలు నిర్వహిస్తుండటంతో స్థానికులు కొందరు మద్యానికి బానిసై, పగలురాత్రి తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ చిందులు వేస్తున్నారు. కుటుంబాన్ని గుల్ల చేసుకుంటున్నారు. ఫలితంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని గమనించిన యువకులు ఒక అడుగు ముందుకు వేసి సోమవారం తండాలో సమావేశమయ్యారు. తండాతో పాటుగా గ్రామంలో మద్యం విక్రయించకూడదంటూ తీర్మానించారు. ఎవరైనా దుకాణ నిర్వహకులు దీనిని ఉల్లంఘిస్తే వారికి రూ.50 వేలు జరిమానా విధిస్తామని సూచించామని గిరిజన తండాకు చెందిన యువజ సంఘం నాయకుడు గణపతినాయక్ తెలిపారు. అనంతరం సమావేశ తీర్మాన ప్రతులను గిరిజన తండాలోని దుకాణ నిర్వహకులకు అందజేసి, ప్రతిజ్ఞ చేయించారు.

పోక్సో కేసులో శిక్ష పడుతుందేమోనని యువకుడి ఆత్మహత్యాయత్నం


గడ్డి మందు తాగుతూ సెల్ఫీ వీడియో తీసుకున్న యువకుడు

శివ్వంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో శిక్ష పడుతుందనే భయంతో ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండల పరిధి శభాష్‌పల్లిలో సోమవారం జరిగింది. ఈ మేరకు సెల్ఫీ వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. శభాష్‌పల్లికి చెందిన పానగారి సుధాకర్(35) ఆరేళ్ల క్రితం ఇదే గ్రామానికి చెందిన ఓ బాలికపై అత్యాచారాయత్నం చేశాడు. దీంతో అప్పట్లో అతనిపై పోక్సో కేసు నమోదైయింది. ఈ కేసు ఇప్పుడు కోర్టులో ట్రయల్‌కు వచ్చింది. కేసు ఫైనల్ దశకు చేరిన నేపథ్యంలో తనకు శిక్ష పడుతుందని భయంతో ఆదివారం భార్యా, తన ఇద్దరు కుమారులను అత్తగారింట వదిలేందుకు వెళ్లాడు. బంధువులు ఫోన్‌చేయగా, లిఫ్ట్ చేయలేదు. దీంతో బంధువులు శివ్వంపేట పోలీసులను సంప్రదించగా, వారు సిగ్నల్ ఆధారంగా నర్సాపూర్‌లో ఉన్నట్లు చెప్పారు. అయితే, అత్తాగారింటి నుంచి నర్సాపూర్ వచ్చిన సుధాకర్ అక్కడ గడ్డి మందు కొనుగోలు చేశాడు. దానికి తాగుతూ 'నేను ఏ తప్పు చేయలేదు. నాకు శిక్ష పడితే భార్యాపిల్లలు దూరమవుతారు. నేను ఆత్మహత్య చేసుకుంటున్నా' అంటూ సెల్ఫీ వీడియో తీసి తన ఫ్రెండ్స్ వాట్సాప్ గ్రూప్‌లో పోస్ట్ చేశాడు. అది చూసిన స్నేహితులు, బంధువులు హుటాహుటిన నర్సాపూర్ వెళ్లి సుధాకర్‌ను హుటాహుటిన సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు.


అంబులెన్స్‌లో తమ వారున్నారా..?



మృత్యు సిగాచి




శిథిలాల తొలగింపు


ఆస్పత్రిలో క్షతగాత్రుడు

మృతిచెందిన కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలి
- ప్రతిపక్ష నాయకుల డిమాండ్

పటాన్‌చెరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో భద్రతా లోపం వల్లే కార్మికుల నిండు ప్రాణాలు బలయ్యాయని సంఘటనా స్థలాన్ని సందర్శించిన పలు పార్టీల ప్రతిపక్ష నాయకులు మండిపడ్డారు. మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నాయకుడు హరీశ్‌రావు మృతుల కుటుంబాలకు రూ.కోటి, గాయపడిన వారికి రూ.50లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల భద్రతా ప్రమాణాలను సమీక్షించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ బాధిత కుటుంబాలను మానవతాదృక్పథంతో ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని సందర్శించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. గాయపడిన వారికి మెరుగైన ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకులు రాజయ్య, మాణిక్ తదితరులు మాట్లాడుతూ పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించడంలేదన్నారు. అధికారులు సైతం ఇష్టాకాజ్యంగా అనుమతులు జారీ చేయడంతో అమాయకులైన కార్మికుల నిండు ప్రాణాలు బలయ్యాయన్నారు. యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కాంగ్రెస్ నేత, నీలం మధిరాజ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గడీల శ్రీకాంత్‌గౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రామచంద్రపురం బీఆర్‌ఎస్ నాయకులు ఆదర్శరెడ్డి, తదితరులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితి సమీక్షించి బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు.

ఎంపీ రఘునందన్‌రావు దిగ్భ్రాంతి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్నందున ఘటనా స్థలికి రాలేకపోయానని, మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతి తెలిపారు. మృతిచెందిన, గాయపడిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ప్రమాదంపై కార్మికశాఖతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు లోతైన దర్యాప్తు జరిపి, ఈ తరహా దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలోనే కార్మికుల కుటుంబాలను పరామర్శిస్తానన్నారు.

రాజకీయాలు చేయవద్దు : కేఏ పాల్

ఇటువంటి సంఘటనల వద్ద కొంతమంది రాజకీయ నాయకులు వచ్చి ప్రభుత్వాన్ని విమర్శించి రాజకీయంగా లబ్ధి పొందాలని చూడటం దురదృష్టకరమని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తెలిపారు. ఈ ప్రమాదంలో ప్రభుత్వ స్పందన బాగానే ఉందని, ఎన్డీఆర్ బృందాలు కష్టపడి పనిచేస్తున్నాయని, వారిని విమర్శించి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం ఎవరు హర్షించరన్నారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, క్షతగాత్రుల కుటుంబాలను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.


కంట్రోల్‌రూం వద్ద వివరాలు తెలుసుకుంటున్న బంధువులు

పరిశ్రమ వద్ద కంట్రోల్‌రూం

రామచంద్రాపురం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమలో ప్రమాదం విషయం తెలియగానే వివిధ శాఖల అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. కలెక్టర్ ప్రావీణ్య నేతృత్వంలో ప్రత్యేకంగా కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు, రామచంద్రాపురం ఆర్‌ఐ శ్రీకాంత్‌నాయక్‌లను ఇన్‌చార్జిలుగా నియమించారు. విధులకు హాజరయిన వారి వివరాలతో పాటు పేలుళ్ల సంభవించినప్పుడు ఎంతమంది ఉన్నారో వెల్లడించారు. పరుగులు తీస్తూ ఇళ్లకు వెళ్లిన వారి వివరాలు సేకరించారు. ఏ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారనే విషయాలు కార్మికుల కుటుంబసభ్యులకు తెలియజేశారు. పరిశ్రమ హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్, ప్రధాన కార్యాలయం ఉన్న మూడంతస్థుల భవనం కూలిపోవడంతో అన్ని రికార్డులు, కంప్యూటర్లు మంటల్లో కాలిపోయాయి. కార్మికుల రోజువారీ హాజరు పుస్తకాలు మంటల్లో ఆహుతి కావడంతో వివరాలు తెలుసుకోవడం కష్టంగా మరింది. బయోమెట్రిక్ అటెండెన్స్ మిషన్లలో రెగ్యులర్ ఉద్యోగుల వివరాలు మాత్రమే ఉన్నాయి. రోజువారీగా పనిలోకి వచ్చేవారికి సంబంధించిన వివరాలు లేకపోవడంతో గందరగోళంగా మారింది.

తన భర్త నాగేశ్వరరావు పరిశ్రమలో కెమిస్టుగా పని చేస్తున్నారని, రోజులాగే ఉదయం తొమ్మిది గంటలకే విధులకు వచ్చారని 9.26 గంటలకే ప్రమాదం జరిగిందని, ఆయన ఆచూకీ కనబడటం లేదని ఆయన భార్య బోరును విలపించింది.

అరవై శాతానికి పైగా కాలిన గాయాలతో అభిలాష్ రెడ్డి మదీనగూడ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆయన కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద తీవ్రంగా విలపిస్తున్నారు.

తన తండ్రి కనిపించకపోవడంతో పరిశ్రమ వద్ద వెతికామని, అక్కడ ఆచూకీ తెలియకపోవడంతో పటాన్‌రు ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వచ్చామని, ఇక్కడ ఎవరిని అడగాలో తెలియడం లేదని కార్మికుడు రామ్‌సింగ్ కుమార్తెలు విలపిస్తున్న తీరు కలిచివేసింది.

మరో ఉద్యోగి బాలకృష్ణ ఉదయం 6 గంటల షిఫ్టులో వచ్చారని, ఏమయ్యాడో తెలియడం లేదని ఆయన భార్య బోరుమన్నది.

సంఘటనా స్థలానికి జిల్లా యంత్రాంగం

సమాచారం తెలిసిన వెంటనే సంగారెడ్డి కలెక్టర్ ప్రావిణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్‌లు చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. స్థానిక పోలీసులు, రెవెన్యూ సిబ్బంది కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, డీఆర్‌ఎఫ్, హైడ్రా తదితర సంస్థల బృందాలు రంగంలోకి దిగాయి. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి తదితర ప్రాంతాల నుంచి ఫైర్ సిబ్బంది, అదనపు బలగాలను రప్పించారు. ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి పదుల సంఖ్యలో అంబులెన్స్‌లను రప్పించారు. క్షతగాత్రుల సంఖ్య పెరిగే సూచనలు ఉండటంతో పటాన్‌చెరు, చందానగర్, మియాపూర్ ప్రాంతాల్లోని ఆసుపత్రులకు ముందస్తు సమాచారం ఇచ్చి క్షతగాత్రులను తరలించారు.

ఆచూకీ తెలియక ఆక్రందనలు

పరిశ్రమ పేలుడులో విషయాన్ని మీడియాలో తెలుసుకున్న కార్మికుల కుటుంబ సభ్యులు, బంధువులు పరిశ్రమ వద్దకు చేరుకుని తమ వారి ఆచూకీ కోసం పోలీసులను, అధికారులను ప్రాధేయపడటం కనిపించింది. చాలాసేపటి తరువాత సోమవారం పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న వారి వివరాలను యాజమాన్యం, అధికారులు వెల్లడించారు. పరిశ్రమ వద్ద హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి, బాధితుల వివరాలను అందించేందుకు పటాన్‌చెరు తహసీల్దార్‌ను నియమించారు. విధులకు వచ్చినవారిలో చాలామంది ఆసుపత్రుల్లో లేకపోవడం.. ఇటు పరిశ్రమ వద్ద కనిపించకపోవడంతో బంధువులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న వారి సంఖ్యకు గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి సంఖ్యకు పొంతన కుదరడం లేదు. మరోవైపు పరిశ్రమ శిథిలాలు తొలగించడంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. రాత్రి కావడం, వర్షం పడటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది.



సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రులు

మంత్రులు వివేక్ వెంకటస్వామి, దామోదర్ రాజనర్సింహ పరిస్థితిని సమీక్షించారు. పరిశ్రమలో పేలుడుపై సమగ్ర దర్యాప్తు చేపతామన్నారు. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆధ్వర్యంలో దర్యాప్తు కొనసాగుతుందన్నారు. ప్రమాదంలో మృతిచెందిన ప్రతీ కార్మిక కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాద స్థలాన్ని ఐజీ సత్యనారాయణ పరిశీలించారు. ప్రమాదంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపడతామన్నారు. శిథిలాలను తొలగిస్తేనే మొత్తం మృతుల సంఖ్యపై స్పష్టత వస్తుందని పేర్కొన్నారు.


ఆచూకీ తెలియని వ్యక్తి


విలపిస్తున్న మహిళ


ముద్దయిన మృతదేహం

విధులకు హాజరైన నిమిషాల్లోనే

రోజులాగే ఉదయం తొమ్మిది గంటలకు కార్మికులు పరిశ్రమకు వస్తుండగానే పేలుడు సంభవించింది. కంపెనీకి చేరుకున్న నిమిషాల వ్యవధిలోనే పలువురు మృత్యువాతపడ్డారు. ప్రమాద సమయంలో మొత్తం 163 మంది కార్మికులు ఉండగా, పేలుడు సంభవించిన ప్రాంతంలో సుమారు 70 మంది ఉన్నట్లు పరిశ్రమ సెక్యూరిటీ సిబ్బంది పేర్కొన్నారు. రాత్రి షిఫ్ట్ ముగించుకున్న కార్మికులు ఉదయం 6 గంటలకు వెళ్లిపోయారు. ఉదయం 6 గంటలకు మొదటి షిఫ్ట్ కార్మికులు విధులకు చేరుకున్నారు. తొమ్మిది గంటలకు జనరల్ షిఫ్ట్ కార్మికులు పరిశ్రమ బస్సుల్లో విధులకు వచ్చారు. హాజరు నమోదుచేసి విధుల్లో నిమగ్నమవుతుండగానే పేలుడు సంభవించింది. అదే సమయంలో ఇంకొందరు కార్మికులు మరో బస్సులో పరిశ్రమలోకి అడుగుపెడుతుండగా పేలుడు సంభవించడంతో డ్రైవర్ బస్సును అలాగే వెనక్కు తీసుకు వెళ్లడంతో వారి ప్రాణాలు దక్కాయి. పేలుడు ధాటికి బస్సు అద్దాలు ధ్వంసమయ్యాయి. కొంచెం ముందు వచ్చి ఉంటే తాము కూడా ప్రమాదం బారినపడేవారిమని, బస్సు ఆలస్యం కావడంతో ప్రాణాలు నిలిచాయని కార్మికులు తెలిపారు. పేలుడు తీవ్రతకు భవన శిథిలాలు వంద మీటర్ల దూరంలో ఉన్న ప్రధాన రహదారిపైన కూడా పడ్డాయి.


ప్రమాద సమయంలో పరిశ్రమ బయట పొగ

తోటివారే తొలుత స్పందించి..

శబ్దం వినిపించగానే చుట్టుపక్కల పరిశ్రమలకు చెందిన కార్మికులు పెద్దసంఖ్యలో చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షణాల్లో పరిశ్రమ మొత్తం మంటలకు ఆహుతి కావడం ప్రారంభమైంది. క్షతగాత్రుల హాహాకారాలు మిన్నంటాయి. క్షతగాత్రులను పరిశ్రమ సెక్యూరిటీ గార్డులు, తోటి సిబ్బంది బస్సులో ఎక్కించి ఆసుపత్రులకు తరలించారు. ఇలా 38 మందిని చికిత్స కోసం తరలించారు. ఫైరింజన్‌లు సంఘటానా స్థలానికి వచ్చేసరికి మంటలు మరింత ఎగసిపడటం ప్రారంభమైంది. సంఘటనా స్థలంలోనే ఐదుగురు మంది మృతి చెందారు. మరో ఇద్దరు ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడి తనువు చాలించారు. శిథిలాలను తొలగించే క్రమంలో మరో 10 మృతదేహాలు లభ్యమయ్యాయి. మొత్తం 15 మంది మృతి చెందారు. ఇంకా శిథిలాల కింద ఎందరు చిక్కుకుపోయారో తెలియని పరిస్థితి ఉంది. మంటలను అదుపు చేసేందుకు సుమారు 30 ఫైరింజన్లు సుమారు ఏడు గంటల పాటు శ్రమించాయి. మంటలు అదుపులోకి వస్తేనే కుప్పకూలిన శిథిలాలను తొలగించే అవకాశం ఉన్నందున విపత్తు నిర్వహణ బృందాలు పెద్ద ఎత్తున నీరు, ఫోంను ఉపయోగించి మంటలను ఆర్పారు. కూలిన భవన శిథిలాలను తొలగించేందుకు గ్యాస్ కట్టర్లను వినియోగించారు. ఎక్స్‌వేటర్లను తెప్పించి జాగ్రత్తగా పక్కకు తొలగించారు. పరిశ్రమ భవనం కింద నుంచి మృతదేహాలను జాగ్రత్తగా పక్కకు తీసేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే కిలోమీటరు దూరంలో ఉన్న పారిశ్రామిక రంగానికి చెందిన రెండు ఫైర్ ఇంజన్ వాహనాలు రంగంలోకి దిగాయి. ప్రమాదం జరిగిన విషయాన్ని పారిశ్రామివేత్తలు పలు వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం పెట్టారు. అలాగే, పటాన్‌చెరు అగ్నిమాపకశాఖకు, పోలీసులకు, కలెక్టర్ కార్యాలయానికి సమాచారం ఇచ్చారు. ఎంఎస్‌ఎన్, అరబిందో పరిశ్రమల ప్రతినిధులు నేరుగా అగ్నిమాపక వాహనాలను ఘటనా స్థలానికి పంపారు. ఫోమ్‌తో నీటిని కలిపి మంటలపై చల్లి పరిస్థితి త్వరగా అదుపులోకి తీసుకొచ్చి ప్రయత్నం చేశారు. నీరు సరిపోకపోతే ట్యాంకర్లతో నీటిని కొనుగోలు చేయించారు. శిథిలాలు తొలగించడానికి ఇంజనీరింగ్ పరిశ్రమల ప్రతినిధులు గ్యాస్‌కట్టర్లు సమకూర్చి డీసీఎం వాహనాల్లో ప్రమాద స్థలానికి పంపారు. ఉదయం నుంచి విధుల్లో ఉన్న వారికి భోజనం, నీరును పరిశ్రమల క్యాంటీన్ల నుంచి పంపారు. తమ కంపెనీల్లో పని చేస్తున్న కార్మికులతో పని చేయిస్తున్నారు.



కార్మికులకు భద్రతేదీ?

- సిగాచి విషాదంతో మరోసారి బట్టబయలైన డొల్లతనం
- నామమాత్రపు తనిఖీలకు పరిమితమైన పరిశ్రమల శాఖ
- గత గుణపాఠాలు విస్మరించడంతో భారీ మూల్యం

పటాన్‌చెరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికవాడల్లోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల డొల్లతనం సిగాచి కెమికల్స్ దారుణ ప్రమాదంతో మరోసారి బట్టబయలైంది. గతంలో జరిగిన ప్రమాదాల నుంచి కనీస గుణపాఠాలు నేర్చుకోకపోవడంతోనే ఈసారి భారీ మూల్యం చెల్లించాల్సి వచ్చిందన్న విమర్శలు తీవ్రమయ్యాయి. పరిశ్రమల యాజమాన్యాలు లాభాపేక్షతో తప్ప, కార్మికుల ప్రాణాలను కాపాడుకునేందుకు కనీస భద్రతా నిబంధనలను కూడా పాటించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

శిక్షణ లేకుండానే పనుల్లో..

సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు, పాశమైలారం, ఐడీఏ బొల్లారం వంటి పారిశ్రామికవాడల్లో భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేయాల్సిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారులకు ఒత్తిడి, పనిభారం వల్ల మొక్కుబడి తనిఖీలకే పరిమితమయ్యారు. భద్రతా వారోత్సవాల సమయంలో తప్ప, కార్మికులకు భద్రతపై కనీసం శిక్షణ తరగతులు కూడా నిర్వహించిన పాపానపోలేదని తెలుస్తోంది. పరిశ్రమ ఉత్పత్తుల్లో కనీస శిక్షణ లేని నిరక్షరాస్యులను పొరుగు రాష్ట్రాల నుంచి కాంట్రాక్టు పద్ధతిలో నియమించి పనిచేయిస్తున్నారు. ప్రమాదకరమైన బాయిలర్లు, రియాక్టర్ల వద్ద సాంకేతిక అంశాలలో శిక్షణ, విద్యార్హత ఉన్నవారిని నియమిస్తే ఎక్కువ వేతనాలు చెల్లించాల్సి వస్తుందన్న ఉద్దేశంతో, యూపీ, బీహార్, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి ఏమాత్రం నైపుణ్యం లేని వారిని ప్రమాదకరమైన విభాగాల్లో తక్కువ వేతనాలకు నియమించడం సర్వసాధారణంగా మారింది. సుమారు 163 మంది కార్మికులు పనిచేసే సిగాచి పరిశ్రమలో కేవలం 36 మంది మాత్రమే పర్మినెంట్ కార్మికులు ఉండటం గమనార్హం. ఒక్క సిగాచిలోనే కాదు, మొత్తం పారిశ్రామిక వాడలోని అన్ని పరిశ్రమల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

విపత్తు సమయంలో ఎలా?

ఏదైనా విపత్తు ఏర్పడినప్పుడు కార్మికులు ఎలా వ్యవహరించాలి, ప్రమాదాల నుంచి ఎలా బయటపడాలి అనే అనేక భద్రతా అంశాలపై పరిశ్రమల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించాలని ఆదేశాలున్నా, యాజమాన్యాలు వాటిని పట్టించుకోవడం లేదు. పరిశ్రమల్లో ఉత్పత్తులకు అనుగుణంగా సేఫ్టీ షూస్, ఆప్రాన్, హెల్మెట్లు, గాగుల్స్ వంటి ఇతర భద్రతా పరికరాలను కల్పించాల్సి ఉంటుంది. ప్రమాదకరమైన సాల్వెంట్లు, సెంట్రిఫ్యూజ్, బాయిలర్లు, ఫర్నేస్‌లు, రియాక్టర్ల వద్ద పనిచేసే సమయంలో పాటించాల్సిన భద్రతా సూత్రాలకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుంది. కానీ, అనేక యాజమాన్యాలు కేవలం వ్యాపార దృక్పథంతో ఆలోచిస్తూ కార్మికుల ప్రాణాలను తాకట్టుపెడుతున్నాయి.

పరిశ్రమల్లో ప్రమాదాలెన్నో.. ఇప్పటివరకు 110 మంది కార్మికుల మృతి

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు గాలికి వదిలేయడంతో ప్రమాదాలు నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. గతంలో హత్నూర మండలం ఎస్బీ ఆర్గానిక్స్‌లో రియాక్టర్ పేలి ఆరుగురు మృతి చెందారు. గత ఏడాది పాశమైలారం పారిశ్రామికవాడలోని వెంకార్ పరిశ్రమలో రియాక్టర్ పేలి నలుగురు చనిపోయారు. ఎంఎస్‌ఎన్, వెంకార్, ఏరిస్ ఆగ్రో, హైదరాబాద్ కెమికల్స్, అరబిందో, రాంటస్, విరూపాక్ష కెమికల్స్ వంటి పలు పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలలో పదుల సంఖ్యలో కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. గతంలో జయవిజయ అల్లాయిస్‌లో ప్రమాదం జరిగి ఆరుగురు కార్మికులు మృతి చెందారు. తాజాగా భారీ ప్రమాదం చోటుచేసుకున్న సిగాచి పరిశ్రమలో సైతం గతంలో అనేక చిన్న చిన్న ప్రమాదాలు జరిగి కార్మికులు మరణించారు. గత వారం హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా జరిగిన జాతీయ సెమినార్‌లో కార్మిక సంఘాల నాయకులు పాల్గొని, ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే గత దశాబ్ద కాలంలో 110 మంది కార్మికులు పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాలలో మృతి చెందారని డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు వినతిపత్రాలు సమర్పించారు. మొక్కుబడి తనిఖీలతో కార్మికుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తున్నప్పటికీ, యాజమాన్యాల్లో కనీస స్పందన లేకపోవడం గమనార్హం. ప్రభుత్వాలకు లాభాలను ఆర్జించిపెడుతున్నామని, ఉపాధి కల్పిస్తున్నామని ఇష్టారాజ్యంగా చెలరేగుతున్న పరిశ్రమలు పారిశ్రామికవాడలో మరెన్నో ఉన్నాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఇటీవల ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 16 మంది వాహనదారులు పట్టుబడ్డారు. సోమవారం వారిని సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ఎదుట హాజరుపరచగా విచారణ అనంతరం రూ. 28,500 జరిమానా విధించారు.

గణితం టీచరు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

బెజ్జంకి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న గణితం సబ్జెక్టును బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ మాలోతు సంగీత తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంఎస్సీ, బీఈడీతో పాటు టెట్‌లో అర్హత సాధించి ఉండాలన్నారు. దరఖాస్తులను పాఠశాలలో అందించాలని సూచించారు. అలాగే ఆరు, ఏడు తరగతుల్లో 50 సీట్లు, 9, 10వ తరగతిలో 16 సీట్లు, ఇంటర్ ఎంపీసీ, బైపీసీలో 50 సీట్లు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులు అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

మెదక్ ఎంపీకి నాయకుల పరామర్శ


ఎంపీని ఆసుపత్రిలో పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

తొగుట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు కుడికాలికి రెండు రోజుల క్రితం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో ఆపరేషన్ జరిగింది. సోమవారం తొగుట మండలానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మల్లుగారి శ్రీకాంత్ రెడ్డి, వెంకట్రాముల బాల్‌రెడ్డిలు మెదక్ ఎంపీని పరామర్శించారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

వర్గల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్ దుకాణదారులు రైతులకు కల్తీ విత్తనాలు విక్రయించినట్లయితే కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ అగ్రికల్చర్ డైరెక్టర్ అనిల్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయాధికారి శేషశయనతో కలిసి తనిఖీ చేశారు.

వర్షాకాల సమస్యలపై దృష్టి సారించాలి

● మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్‌పర్సన్


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు

సిద్దిపేట ఆంధ్రజ్యోతి, జూన్ 30: వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య పనుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వార్డులలో సమస్యలపై దృష్టి సారించాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు ఆదేశించారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, దాంతో పాటు పలు సమస్యలను కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకవచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు మాట్లాడుతూ ఆయా వార్డుల్లో వీధికుక్కలను గుర్తించి వెంటనే వాటిని ఎనిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ)కు తరలించే ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులందరికీ తప్పనిసరిగా ఈఎస్ఐ, ఈపీఎఫ్ ఉండేలా చూడాలని కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌కు సూచించారు. పట్టణంలో ఆరుబయట చెత్త వేసే బ్లాక్ స్పాట్‌లను గుర్తించి చెత్తను తొలగించాలని, బ్లాక్‌స్పాట్‌లలో చెత్తను వేసేవారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు, కోఅప్షన్ సభ్యులు, మున్సిపల్, విద్యుత్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పప్పు దినుసుల సాగుతో అధిక లాభాలు


కొండపాక: దుద్దెడలో కంది విత్తనాలను అందచేస్తున్న జిల్లా అధికారి రాధిక

కొండపాక/జగదేవ్‌పూర్/దౌల్తాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పప్పు దినుసుల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక పేర్కొన్నారు. కొండపాక మండలం దుద్దెడ రైతు వేదికలో సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి రాధిక ఆధ్వర్యంలో కంది విత్తనాల చిరు సంచుల పంపిణీ చేశారు. జాతీయ ఆహార భద్రతా మిషన్ పథకం కింద కంది విత్తనాలు చిరు సంచులు ఎల్ ఆర్ జీ-41 రకం విత్తనాలను రైతులకు అందచేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శివరామ కృష్ణ , ఏఎంసీ వైస్ చైర్మన్ బట్ట పరశురాములు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్ మండలంలోని 8 మంది రైతులకు నాలుగు కిలోల కంది విత్తన సంచులను సోమవారం గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి స్థానిక రైతు వేదికలో అందజేశారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి, ఏవో వసంతరావు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను తట్టుకొని ఈ పంట దిగుబడి ఎక్కువ వస్తుందన్నారు. దౌల్తాబాద్ మండలంలోని దొమ్మాట, ముబ్బారస్‌పూర్, తిర్మలాపూర్, దౌల్తాబాద్ రైతు వేదికల్లో రైతులకు సబ్సిడీపై కంది విత్తనాలను ఏవో సాయికిరణ్ అందజేశారు.

గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం


తొగుట: లింగంపేటలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి తదితరులు

తొగుట/సిద్దిపేట రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పేదల బతుకుల్లో వెలుగు నింపడానికి కృషి చేస్తున్నట్లు దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం తొగుట మండలం గుడికందుల, లింగంపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేసి మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. అంతకు ముందు గుడికందుల గ్రామానికి చెందిన భూరెడ్డిగారి మోహన్ రెడ్డికి మంజూరైన 60 వేల రూపాయల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పనులను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనుల్లో వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ, పంచాయతీ కార్యదర్శి నరసింహాచారి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌వీర్, మహిళ కాంగ్రెస్ మండలం అధ్యక్షురాలు దసరి ఉమా, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అంటరానితనం రూపుమాపేందుకు కృషి

తొగుట/బెజ్జంకి/చేర్యాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు గ్రామాల్లో సోమవారం పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ఆయా గ్రామస్థులకు అవగాహన కల్పించారు. అంటరానితనం రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. తొగుట మండలం జప్తి లింగారెడ్డిపల్లి గ్రామంలో ఎస్ఐ రవి కాంతారావు మాట్లాడుతూ..గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. వెంట తొగుట ఆర్ఐ అశోక్‌రాజ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు ఉన్నారు. బెజ్జంకి మండలంలోని పోతారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గోపాల్ పాల్గొని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. చేర్యాల మండలం చుంచనకోటలో ఎస్ఐ నీరేశ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇతరుల హక్కులకు భంగం కలిగించకుండా వ్యవహరించాలన్నారు.

హెచ్ఎం రవీందర్ సేవలు ఆదర్శనీయం


హెచ్ఎం రవీందర్‌ఉమాదేవి దంపతులకు సన్మానం

మద్దూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డునందుకున్న హెచ్ఎం రవీందర్ సేవలు అదర్శనీయమని ఎంఈవో వరదరాజు కొనియాడారు. సోమవారం మద్దూరు మండలంలోని లద్నూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, స్నేహితులు రవీందర్‌ఉమాదేవి దంపతులను పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు, పాఠశాల చైర్‌పర్సన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న స్కూళ్ల గుర్తింపు రద్దు చేయాలి

సిద్దిపేట కల్చరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ సిద్దిపేట శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయించటం వారి దృష్టికి వచ్చింది. ఇదే విషయం ఎంఈవో రాజప్రభాకర్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి వినతి పత్రం అందజేసి పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ సిద్దిపేట జిల్లా కన్వీనర్ ఆదిత్య మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సదరు పాఠశాలలో పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ విక్రయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి పరశురాం, నగర ఉపాధ్యక్షుడు వసంత్, లోకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎన్ఆర్ రావు స్ఫూర్తితో యువ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

సిద్దిపేట కల్చరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సీఎన్ఆర్ రావు స్ఫూర్తితో విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఇన్‌చార్జి డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ డాక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. ప్రొఫెసర్ సీఎన్ఆర్ రావు (చింతామణి నాగేశ రామచంద్రరావు) జన్మదినం సందర్భంగా సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నానో టెక్నాలజీ - అనువర్తనాలు అనే అంశంపై సదస్సును నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆంజనేయులు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఇన్‌చార్జి డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ సాలిడ్ స్టేట్ కెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్, నానో టెక్నాలజీలో సీఎన్ఆర్ రావు చేసిన విశిష్ట కృషిని గురించి విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి సునీతకెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరగనివ్వక పోవడానికి నియోజకవర్గం మీ జాగీరా?: బీఆర్ఎస్

హుస్నాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌ను ఈ నియోజకవర్గంలో తిరగనివ్వమని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించడం పట్ల బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. ఇది మీ జాగీరా..? అంటూ ప్రశ్నించారు. సోమవారం హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధులు సుద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎండీ అన్వర్, మాజీ కౌన్సిలర్ బొజ్జ హరీశ్‌లు విలేకరులతో మాట్లాడారు. రూ. 10 వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌దని పేర్కొన్నారు. మా హయాంలో అవినీతి జరిగిందని అంటున్నారు కదా.. అధికారం మీదే కాబట్టి విచారణ జరిపించి చర్యలు తీసుకోవచ్చని సవాల్ విసిరారు.

విజయ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి

హుస్నాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ విజయ పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఎన్నికలు సోమవారం సంఘ కార్యాలయంలో జరిగాయి. ఇందులో రెండు డైరెక్టర్ స్థానాలకు ఎన్నికలు జరుగగా అందులో ఆకుల శ్రీనివాస్, కాటం మహేశ్ ఎన్నికయ్యారు. అనంతరం 9 మంది డైరెక్టర్లు కాయిత బాల్‌రెడ్డిని సంఘం చైర్మన్‌గా ఎన్నుకున్నారు. అనంతరం సంఘ సభ్యులతో వార్షికోత్సవ సమావేశం ఏర్పాటు చేసి సంఘ లావాదేవిలను వివరించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డైరెక్టర్లు గురాల సంజీవరెడ్డి, బీజాంబీ, ఎలకంటి మాధవి, కాశబోయిన మల్లేశం, బొలిశెట్టి సమ్మయ్య, ఖమ్మం రవీందర్, గొర్ల సాంబరాజు ఉన్నారు.

చేర్యాలలో ఉద్యమకారుల నిరసన దీక్ష

చేర్యాల, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికలముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ చేర్యాలలో తెలంగాణ ఉద్యమకారులు నిరసన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా స్థానిక అంగడిబజారు చౌరస్తా వద్ద తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారులు అంబటి నర్సయ్య, ఆడెపు వెంకయ్య, అంబటి అంజయ్య, ఎండీ జహీరుద్దీన్, బండోజు భాస్కర్, పుర్మసంజీవరెడ్డి, మంగోలు చంటి, మంచాల కొండయ్య, అందె అశోక్ దీక్ష చేపట్టారు. పలువురు మాట్లాడుతూ తమకిచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. దీక్షకు మాజీ ఎంపీపీ మేడిశెట్టి శ్రీధర్, బీఆర్ఎస్ నాయకుడు అంకుగారి శ్రీధర్‌రెడ్డి, నాయకులు సంఘీభావం తెలిపారు. సాయంత్రం నర్సయ్య నిమ్మరసంతో దీక్ష విరమింప చేశారు.

సాగునీరందించేందుకు కృషి: పల్లా

చేర్యాల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సీజన్ ప్రారంభమైనప్పటికీ వర్షాభావంతో రైతులు ఆందోళన చెందుతున్న విషయమై జనగామ నియోజకవర్గ రైతాంగానికి గోదావరి జలాలు అందించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. సోమవారం చేర్యాల ప్రాంతానికి చెందిన పలువురు రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పల్లాను కలిసి సీజన్ సాగుపరిస్థితులు వివరించారు. దీంతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈవిషయమై తాను నీటిపారుదలశాఖమంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు సంబంధితశాఖల అధికారులతో మాట్లాడి లేఖ రాస్తున్నట్టు తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతోనే గోదావరి జలాలు: బీఆర్ఎస్

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతో తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల పంపింగ్ ప్రారంభించారని బీఆర్ఎస్ నాలుగు మండలాల యూత్ అధ్యక్షుడు శివగారి అంజయ్య, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్‌అన్నారు. సోమవారం సాయంత్రం రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేపట్టడం పట్ల హర్షంవ్యక్తంచేస్తూ చేర్యాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

చేసిన పనికి డబ్బులు ఇవ్వలేదని జీపీ ట్రాక్టర్లు స్వాధీనం

కొండపాక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీకి సంబంధించిన పనులు చేసినా డబ్బులు ఇవ్వకపోవడంతో జీపీకి చెందిన రెండు ట్రాక్టర్లను పట్టుకుపోయారు. ఈ సంఘటన మండలంలోని దుద్దెడలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుద్దెడ గ్రామానికి చెందిన జక్కుల మల్లేశం అనే వ్యక్తి గత రెండు మూడేళ్ల క్రితం తన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ వాహనాలతో గ్రామంలో జీపీకి చెందిన పలు పనులను పూర్తి చేశాడు. దానికి సంబంధించిన డబ్బులు ఇంత వరకు ఇవ్వకపోవడంతో ఎవరిని అడిగినా ఫలితం లేకపోయింది. దీంతో గ్రామపంచాయతీకి చెందిన రెండు ట్రాక్టర్లను తీసుకొని వెళ్లాడు. సుమారు రూ.2 లక్షల వరకు జీపీ నుంచి బకాయిలు ఉన్నాయని, పంచాయతీ కార్యదర్శిని అధికారులను అడిగినా స్పందించకపోవడంతో ట్రాక్టర్లను తీసుకుపోయినట్లు మల్లేశం వివరించాడు. పంచాయతీ కార్యదర్శి చక్రపాణిని వివరణ కోరగా పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.